ఎప్పుడేమైనా జరగొచ్చు.!



ప్రాణ సంకటంగా మారిన సంజయ్‌గాంధీనగర్ క్వార్టర్స్

- కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ శిథిల భవనం
- శ్లాబ్‌ల పెచ్చులూడుతున్నా భయం గుప్పిట్లో ఉంటూ..
- వేరే ప్రాంతానికి వెళ్లలేక బిక్కుబిక్కుమంటూ ఉంటున్న వైనం
- కాపాడాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులకు వేడుకోలు

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ సంజయ్‌గాంధీ నగర్‌లో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ 1998లో క్వార్టర్స్ (జీప్లస్ 3) నిర్మించింది. 27 ఏళ్ల క్రితం స్థానిక పేదలకు ఇందులో ఫ్లాట్‌లను కేటాయించింది. అప్పటి నుంచి ఈ క్వార్టర్స్‌లో సుమారు 54 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రస్తుతం క్వార్టర్స్‌లోని చాలా ఫ్లాట్‌లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. క్వార్టర్స్‌కు అక్కడక్కడా పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా సందర్భాలలో కొన్ని ఫ్లాట్‌లలో శ్లాబ్ పెచ్చులూడి కిందపడ్డాయి. దీంతో ఇక్కడి వారు బిక్కుబిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల బాల్కనీ రెయిలింగ్ కూలి ముగ్గురికి గాయాలు...

◆ క్వార్టర్స్ బాల్కనీ రెయిలింగ్ కూలి ఇటీవల ఓ వ్యక్తితో పాటు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఎం.సంజయ్ (25) తన కూతురు ఎం.క్షేత్ర (2)తో కలిసి ఇంట్లో నుంచి పాల ప్యాకెట్ తీసుకురావడానికి బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా బాల్కనీ రెయిలింగ్ కూలి తండ్రి, కూతురు ఇద్దరు కింద పడ్డారు. రెయిలింగ్ శిథిలాలు పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడటంతో ఆ ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. ఇంట్లో పడుకుని ఉన్న చిన్నారి పి.నిత్యా సింగ్ (6నెలలు)కు గాయాలయ్యాయి.

ఇక్కడే ఇళ్లు కట్టించి ఇవ్వాలి: బస్తీ ప్రజలు

◆ బస్తీ క్వార్టర్స్ స్థానంలో కొత్త ఇళ్లు కట్టించి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. క్వార్టర్స్‌ను కూల్చేసి కొత్తగా 54ఫ్లాట్‌లతో క్వార్టర్ కట్టించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

◆ **సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి: అధికారులు**
సంజయ్‌గాంధీనగర్ బస్తీని ఇటీవల హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి.సంధ్యారాణి, జీహెచ్‌ఎంసీ ఏసీపీ దేవేందర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సందర్శించి బస్తీవాసులతో మాట్లాడారు. బాల్కనీ రెయిలింగ్ కూలి గాయపడ్డ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. క్వార్టర్స్ ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ఎప్పుడైనా ప్రమాదం జరగొచ్చని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. స్థానికుల నుంచి వస్తున్న



ఇటీవల కూలిన బాల్కనీ రెయిలింగ్, శ్లాబ్



విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

అండగా ఉంటామంటున్న అఖిలపక్ష పార్టీల నేతలు

కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణితో పాటు వివిధ పార్టీల నేతలు బస్తీలో పర్యటించారు. నేరుగా సమస్యను పరిశీలించి వాని డిమాండ్లను తెలుసుకున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న క్వార్టర్స్ స్థానంలో మరో భవనం నిర్మించేలా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టి తీసుకెళ్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే తాము న్యాయం జరిగే వరకు పోరాడతామని బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారమయ్యే వరకు బస్తీవాసులకు అన్ని వేళలా అండగా ఉంటామని తెలిపారు.



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన సంజయ్‌గాంధీనగర్ బస్తీ క్వార్టర్స్

న్యాయం జరిగేలా చూస్తా: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఇటీవల బస్తీవాసులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని.. భయంతో బతుకుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కొత్తగా భవనాన్ని నిర్మించి ఇవ్వాలని వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన



వినతి పత్రం అందజేస్తున్న బస్తీ ప్రజలు

బస్తీవాసులతో మాట్లాడుతూ న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయిస్తాం: ఎమ్మెల్యే కాలేరు

ఇటీవల బస్తీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్వార్టర్స్‌లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వచ్చే నెలలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

కంటోన్మెంట్: మారేడుపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వచ్చే నెల మొదటి వారంలో లబ్ధిదారులకు అందజేస్తామని తహసీల్దార్ భీమయ్య గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2016లో ఓల్డ్ మారేడుపల్లిలోని హౌసింగ్ బోర్డు స్థలంలో నిర్మాణాలను తొలగించి 468 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. వీటిలో తొలిదశలో 253 మందికి, తర్వాత మరో 8 మందికి మొత్తం 261 మందికి డబుల్ బెడ్రూంలను అప్పగించారు. అయితే పలు కారణాల వల్ల మిగిలిన 207 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతూ వచ్చింది. తాజాగా అర్హులైన స్థానికులతో లబ్ధిదారుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చిందని, నగరంలో ఎమ్మెల్సీ కోడ్ ముగిసిన వారం రోజుల్లోనే ఇళ్ల పంపిణీ చేపడతామని పేర్కొన్నారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

అడ్డగుట్ట మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట: యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి అడ్డగుట్ట మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని తుకారాంగేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు కోరారు. ఈ మేరకు పికెట్ డిపో మేనేజర్ రవీందర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేబీఎస్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే బస్సులను అడ్డగుట్ట, తుకారాంగేట్ నుంచి కాకుండా శెనాయ్‌నర్సింగ్ హోమ్, అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతినగర్ల మీదుగా నడిపితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. సత్యనారాయణ, గంగారామ్ ఉన్నారు.

కంటోన్మెంట్‌కు ప్రత్యేక నిధులు కేటాయించండి



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీగణేశ్ రాష్ట్ర రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు పలు ప్రాంతాల్లో కొత్తవి నిర్మించాలని, అలాగే మహిళా భవనాలు, ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. పార్కుల అభివృద్ధితో పాటు వాటిలో వాకింగ్ ట్రాక్స్, పిల్లలకు క్రీడా పరికరాల ఏర్పాటు, నియోజకవర్గంలోని గ్రేవీ యార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు.

‘స్వచ్ఛభారత్’లో భాగస్వాములవ్వాలి



పరిసరాలు శుభ్రం చేస్తున్న వెల్లాల రామ్మోహన్ తదితరులు

సనత్‌నగర్: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు సనత్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిసరాల్లో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం శ్రమదానం చేశారు. చీపురుతో ఆస్పత్రి చుట్టుపక్కల చెత్తాచెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో పరిసరాలను కూడా అదే మాదిరిగా ఉండేలా చూడాలన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: అనారోగ్యంతో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పండరి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బిక్నూర్ గ్రామానికి చెందిన డి.మారుతి (33) కూలీ పనులు చేస్తుంటాడు. కొద్దిరోజుల క్రితం పక్షవాతం రావడంతో కుడి కాలు, చేయి పనిచేయడం లేదు. దీంతో అనారోగ్యంతో పాటు కుటుంబానికి భారం కావద్దనే ఉద్దేశంతో మల్కాజిగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాక్ వద్దకు చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా తలకు బలమైన గాయం కావడంతో పాటు, రెండు కాళ్లు తెగిపోయాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

రాంగోపాల్‌పేట్: కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్, టెక్ మహీంద్ర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసు అయిన యువతకు బిల్లింగ్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ టైపింగ్, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ, అలాగే పదో తరగతి పూర్తి చేసిన వారికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్ అసిస్టెంట్), కంప్యూటర్ టైపింగ్, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఆస్పత్రుల్లో జీడీఏగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని 18 నుంచి 29 ఏళ్ల వయస్సు వారు అర్హులని తెలిపారు. ప్రస్తుత అకాడమీలో ఇంటర్ బైపీసీ చదివిన వారికి బీఎస్సీ పారా మెడికల్‌లో అడ్మిషన్లు ఇస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్, టెక్ మహీంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్ పాత సన్‌షైన్-కిమ్స్ ఆస్పత్రిలో లేదా 8247255859 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నల్లాలకు మోటార్లు బిగిస్తే జరిమానా



మోటార్‌ను సీజ్ చేస్తున్న వాటర్ వర్క్స్ మేనేజర్ మహమ్మద్ ఆసిఫ్ అలీ

లాలాపేట: నల్లాలకు మోటార్లు బిగిస్తే రూ. 5 వేల జరిమానాతో పాటు మోటార్‌ను సీజ్ చేస్తామని తార్నాక వాటర్ వర్క్స్ మేనేజర్ మహమ్మద్ ఆసీఫ్ అలీ హెచ్చరించారు. తార్నాక గోకుల్‌నగర్, నాగార్జున నగర్ ప్రాంతాల్లోని పలు ఇండ్లలో నల్లాలకు బిగించిన మోటార్లను మంగళవారం గుర్తించి వాటిని సీజ్ చేసి, రూ 5 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజలకు తాగునీటిని అందించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అయితే అందరికీ సమానంగా అందాల్సిన నీటిని కొందరు నల్లాలకు మోటార్లు బిగించి ఎక్కువ మొత్తంలో వాడుతున్నారన్నారు. ఎవరైనా మోటారు బిగిస్తే జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి సిబ్బంది పాపారావు, అశోక్ తదితరులు ఉన్నారు.

నేడు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల మహాధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల మహా ధర్నాను ఈనెల 16న(నేడు) ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు ధర్మతేజ, పరశురాం, ఉపేందర్, వేల్పుల కుమార్, విజయేందర్ రెడ్డి, కృష్ణయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ పిలుపు మేరకు జరిగే మహాధర్నాలో రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన 1300 మంది అధ్యాపకులు పాల్గొననున్నట్లు తెలిపారు. వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేసేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఓయూ వీసీ మొండి వైఖరి వీడాలి

ఓయూ వీసీ ప్రొ.కుమార్‌పై పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు మండిపడ్డారు. మంగళవారం వినతి పత్రం అందించేందుకు వీసీని కలిసేందుకు వెళ్లిన మహిళా అధ్యాపకులకు రాత్రి 7:30 వరకు అనుమతి ఇవ్వకుండా వేయిట్ చేయించారని ఆరోపించారు. కాంట్రాక్టు అధ్యాపకులపై వీసీ మొండి వైఖరి వీడాలని కోరారు.

చలో సెక్రటేరియేట్ పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. పార్ట్‌టైం అధ్యాపకుల (పీటీఎల్) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న తలపెట్టిన చలో సెక్రటేరియల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీటీఎల్ అధ్యక్షుడు డా.సోమేశ్వర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 12 వర్సిటీల అధ్యాపకులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.

డెంటల్ క్లినిక్ ధ్వంసం



అమీర్‌పేట: అమీర్‌పేటలో ఓ డెంటల్ క్లినిక్ గోడలు ధ్వంసం చేసి వైద్య పరికరాలు, నగదును ఎత్తుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామ్ ప్రసాద్ అనే వ్యక్తి అమీర్‌పేట 50 పడకల ఆసుపత్రి ఎదుట గల భవనంలో శ్రీ వెంకటరమణ డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి క్లినిక్ గోడలు ధ్వంసమై ఉండడంతో లోనికి వెళ్లి చూడగా విలువైన వైద్య పరికరాలు, నగదుతో పాటు భూమి పత్రాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పక్కనే టైర్ల షాపు నుంచి గోడలు ధ్వంసం చేసి లోనికి చొరబడినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు సైతం ధ్వంసం చేశారు. కాగా చరణ్‌సింగ్ ఆ భవనాన్ని కొనుగోలు చేయగా, ఇటీవల క్లినిక్‌కు వచ్చి ఖాళీ చేయాలని రామ్ ప్రసాద్‌ను కోరాడు. దీంతో ఉన్న ఫలంగా వెళ్లమంటే ఎలా అని ప్రశ్నించగా ఇరువురి మధ్య గొడవ జరగడంతో రామ్ ప్రసాద్ కోర్టును ఆశ్రయించాడు. వివాదం కోర్టులో ఉన్నప్పటికీ పథకం ప్రకారం చరణ్‌సింగ్ అనుచరులతో వచ్చి క్లినిక్ ధ్వంసం చేసి సామగ్రి తరలించి ఉంటాడని రామ్‌ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: సంకట హర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్, గణపతి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 38, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 15, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

డాక్టరేట్ అందుకున్న అశోక్‌యాదవ్‌కు అభినందనలు



లాలాపేట: జర్మనీలోని ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి సోషల్ సర్వీసు విభాగంలో రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.కొమ్ము అశోక్ యాదవ్ ఇటీవల రెండో గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు. దీంతో కొండాపూర్‌లోని రాష్ట్ర పోలీసు 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణను ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టరేట్ సర్టిఫికెట్‌ను ఆయన చేతుల మీదుగా మరోసారి అందుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఆయనను అభినందించారు.

జార్జిరెడ్డి లెజెండరీ లీడర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి జార్జిరెడ్డి లెజెండరీ లీడర్ అని పలువురు విద్యార్థి నాయకులు కొనియాడారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జార్జిరెడ్డి 53వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యాదర్శులు నాగేశ్వర్‌రావు, సుమంత్ మాట్లాడుతూ.. జార్జిరెడ్డి ఆలోచనల వ్యాప్తికి జార్జిరెడ్డి స్మృతిలో సంస్మరణ అనే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఓయూను సందర్శించిన సాన్‌జోస్ వర్సిటీ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ: అమెరికాకు చెందిన సాన్‌జోస్ స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం మంగళవారం ఓయూను సందర్శించింది. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ.కుమార్‌తో సమావేశమైన సాన్‌జోస్ వర్సిటీ ఇంజినీరింగ్ డీన్ షెరిల్ ఎహర్మాన్, ఆదిత్య సావంత్ విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, మార్కెట్, కేంద్ర కోర్సులపై చర్చించి భాగస్వామ్యం కోసం యత్నిస్తున్నట్లు తెలిపారు.

పోషకాలు ఉండేలా చూసుకోవాలి



ఆహార పదార్థాలు ప్రదర్శిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత, అంగన్‌వాడీ సిబ్బంది

లాలాపేట: రోజువారీ ఆహారంలో పోషకాలు ఉండేలా చూసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత సూచించారు. జాతీయ పోషణ మాసోత్సవంలో భాగంగా లాలాపేట సత్యానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం ఎంత బలవర్ధకమైన ఆహారమని తప్పకుండా పిల్లలకు పెట్టాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మిల్లెట్లు వంటి పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలింతలకు ఆహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళా సమాఖ్య నాయకురాలు తిరుమల రేణుక, అంగన్‌వాడీ టీచర్లు కృపావతి, సంధ్య, అనిత, రోజారాణి తదితరులు ఉన్నారు.

‘దేశ సంపద కార్పొరేట్ శక్తులకు దారాదత్తం’

లాలాపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నదని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి ఆరోపించారు. తార్నాకలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బీపీ మండల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.తిరుపతికుమార్, డా.నిమ్మతోట వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ టి. వెంకటరాజయ్య, మిర్జా మజీరుల్లా బేగ్, లక్ష్మణ్, శ్రీహరి ముదిరాజ్, బోనాల విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం ఈనెల 23న నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బీజేపీ నాయకుడు మేకల సారంగపాణి, కమిటీ ప్రతినిధులు మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 23న ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం కాలనీలో అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

దళితరత్న అవార్డుల ప్రదానం





దళిత రత్న అవార్డు అందుకుంటున్న మీసాల ఎల్లేష్

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం, షెడ్యూల్ కులాలు సంయుక్తంగా నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా దళితరత్న అవార్డులను ప్రకటించారు. నియోజకవర్గానికి చెందిన మీసాల ఎల్లేశ్ సోమవారం సాయంత్రం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లేశ్ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా గురుకులాల్లో మెరుగైన విద్య, అంటరానితనం, కులవివక్ష నిర్మూలనతో పాటు ఇతర ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. అవార్డు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మహనీయుల జయంతి ఉత్సవాల వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, చెరుకు రామచందర్, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న కృతజ్ఞతలు తెలిపారు.

ఉపదే సనాధన్‌కు..

అడ్డగుట్ట: తుకారాంగేట్ మాంగర్‌బస్తీకి చెందిన ఉపదే సనాధన్ రవీంద్రభారతిలో 57 ఎంబీ ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖైరి వెంకటేశం చేతుల దళిత రత్న అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు మహేశ్, గోపి, సంజు, రతీలాల్, మోతీలాల్, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

చెలిమెల వెంకటగిరి కిశోర్ బాబుకు..

అమీర్‌పేట: తెలంగాణ దళిత బహుజన సమితి నగర అధ్యక్షుడు చెలిమెల వెంకటగిరి కిశోర్ బాబు దళిత బహుజన సమితి వ్యవస్థాపకుడు గజ్జెల్లి మల్లికార్జున్ సమక్షంలో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటిక రాజు మాదిగ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో బహుజన సమితి ప్రధాన కార్యదర్శి జి.ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీను, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.